పేదల గొంతుక వైఎస్సార్‌సీపీ


తిరుపతిలో కేక్ కట్ చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నాయకులు


పీవీపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తిరుపతి, చంద్రగిరిలో ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు
- పార్టీ జెండాలను ఆవిష్కరించిన తిరుపతి, చంద్రగిరి సమన్వయకర్తలు
- ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో అదే జోష్

చంద్రగిరి: పేదల పక్షాన అండగా నిలబడే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు అంబరాన్నంటాయి. ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఎక్కడా వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ తగ్గట్లేదు. బుధవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయరెడ్డి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. అలాగే చంద్రగిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ప్రతి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు జరుపుకున్నారు. రామచంద్రాపురం మండలం పీవీపురం గ్రామానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేరుకుని గ్రామస్తులతో కలసి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే చంద్రగిరిపార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ అన్నారు. ఎవరు ఎన్ని రకాలుగా భయపెట్టాలని ప్రయత్నించినా పార్టీలో క్యాడర్‌ను మాత్రం ఏమీ చేయలేరన్నారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ అధికారం కోసం పార్టీలు పెడతారని, జగనన్న మాత్రం వైఎస్సార్ ఆశయ సాధనకు, ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో 14 ఏళ్ల కిందట క్రితం పార్టీని స్థాపించారన్నారు. ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి పోరాటాలతో పైకి లేచిందని, దేశ రాజకీయాల్లో కనివినీ ఎరుగని రీతిలో విజయాలను సొంతం చేసుకుని దేశం మొత్తం తనవైపు చూసేలా చేసిన ఏకైక పార్టీ కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. అన్ని ప్రాంతీయ పార్టీలకు ఎవరో ఒక గాడ్ ఫాదర్ వుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే పట్టుకొమ్మలుగా నిలబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరుపతి రూరల్ మండలం సీ.మల్లవరంలో..

తిరుపతి రూరల్ మండలంలో..!

తిరుపతి రూరల్ మండలంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. 34 పంచాయతీలో అత్యధికంగా సర్పంచ్‌లు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా దివంగత మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. అదే విధంగా పలు పంచాయతీల్లో అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మొక్కల భారతి, తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో సీ.మల్లవరంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీపై తరగని అభిమానం


సి.గొల్లపల్లిలో ..

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని ప్రతి పంచాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పాకాలలో..


పాకాల: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు విందు భోజనం

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. బుధవారం పి.చెంగయ్య భార్య పి.ఆనందమ్మ, కుమారుడు పి.శేఖర్(ఎంఎస్‌సీ)ల జ్ఞాపకార్థం అంబేడ్కర్ భవన్ సభ్యుడు, ఆనందమ్మ సోదరుడు నరసింహులు, శోభారాణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శోభారాణి, కృష్ణమూర్తి, రాజేంద్రుడు, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ మేళా

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 20 వరకు నిర్వహించనున్న బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)-2019, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)-2020లో పెండింగులో ఉన్న దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి, టీడీఆర్‌లపై అవగాహన కల్పించనున్నామని చెప్పారు. మార్చి 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

వెటర్నరీ జూడాల వినూత్న నిరసన


మోకాళ్లపై నిలబడి యాప్రాన్‌తో బిక్షాటన చేస్తున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: గౌరవవేతనం పెంచాలంటూ గత 38 రోజులుగా సమ్మె చేస్తున్న వెటర్నరీ విద్యార్థులు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. వర్సిటీలోని వైఎస్సార్ పరిపాలనా భవనం ఎదుట మోకాళ్లపై నిలబడి యాప్రాన్‌తో బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించి స్టైఫండ్ పెంచే వరకూ సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే అన్ని కళాశాల విద్యార్థులు గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు అపాయింట్‌మెంట్ కోరడమైందని తెలియజేశారు.

17న చలో విజయవాడ

తిరుపతి కల్చరల్: గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, టెండర్ విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న చేపట్టే చలో విజయవాడను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయన చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఘనంగా గ్లకోమా వారోత్సవాలు


గ్లకోమా వారోత్సవాలలో పాల్గొన్న అధికారులు వైద్యులు

తిరుపతి తుడా: నగరంలోని రుయా ఆస్పత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం గ్లకోమా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖర్ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్లకోమా కంటి వ్యాధి అని, నరాలను చచ్చుపడేట్లు చేసి కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రారంభ దశలో గుర్తించి శస్త్ర చికిత్స చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మహిళా దినోత్సవం ముగింపు

స్విమ్ ఆస్పత్రిలో బుధవారం మహిళా దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్విమ్స్‌డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, మహిళావైద్యులు అతిథులను సత్కరించారు.

అలరించిన 'విరించి'


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పద్మావతి మహిళా వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న విరించి-2025 టెక్ ఫెస్ట్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వీసీ ప్రొఫెసర్ ఉమ, ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ ముఖ్యఅతిథులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిపై అవగాహనతో పాటు విద్యార్థులలోని సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాన్ని వెలికి తీయడమే విరించి టెక్‌ఫెస్ట్ ప్రధానం ఉద్దేశమన్నారు. అనంతరం ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాంప్ వాక్, మెహందీ, నృత్య ప్రదర్శనలు, మిస్ విరించి పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని ఉర్రూతలూగించారు. – తిరుపతి సిటీ

మహోన్నతం..వేద విజ్ఞానం


సదస్సు ప్రారంభోత్సవంలో అతిథులు

తిరుపతి సిటీ : వేద విజ్ఞానం మహోన్నతమని, సమాజానికి తప్పనిసరిగా అందించాలని టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. బుధవారం వేదవిశ్వ విద్యాలయంలో వైఖానస,పాంచరాత్ర, శైవాగమంలపై 21రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సును ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్రాలు, ఆలయ సంస్కృతిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్, వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్ గోళి సుబ్రమణ్య శర్మ, రామకృష్ణ, భరత శేఖరాచార్యులు, కార్తికేయన్, డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు

భారతీయ సంస్కృతికి ప్రోత్సాహం


మాట్లాడుతున్న డాక్టర్ సచ్చిదానంద జోషి

తిరుపతి సిటీ : భారతీయ సంస్కృతి, కళలక ప్రోత్సాహమందించడమే లక్ష్యంగా ఐజీఎన్‌సీఏ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమని మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానంద జోషి, డాక్టర్ ప్రియాంక మిశ్రా తెలిపారు. బుధవారం తిరుచానూరులో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం ప్రారంభించారు. అనంతరం జాతీయ సంస్కృత వర్సిటీలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఆధునిక తరానికి కళలపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. వీసీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయం, సాహిత్యాలను నేటితరానికి అందించాలనే లక్ష్యంతో వర్సిటీ పనిచేస్తోందన్నారు. విద్యావేత్త మాళవికా జోషి, పద్మా సుబ్రమణ్యం , పాండిచ్చేరి రీజనల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాఘవన్, నోడల్ ఆఫీసర్ అనితా సూరి, డీన్ దక్షిణమూర్తి శర్మ, పీఆర్‌ఓ ప్రొఫెసర్ రమేష్, డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

తిరుపతి క్రైమ్: తిరుమలలో గరుడ-2 పోలీస్ గెస్ట్ హౌస్ నిర్మించడానికి ఏపీ డీజీపీ ఆర్కే మీనా తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తిరుమలలో పోలీస్ క్వార్టర్స్ మధ్య గల ఖాళీ స్థలంలో గరుడ-2 గెస్ట్ హౌస్ నిర్మాణానికి స్థలం వివరాలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయశేఖర్, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తిరుమలలో పౌర్ణమి గరుడ సేవ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మార్చి 14న గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.


నిజాయితీ చాటిన కల్యాణకట్ట ఉద్యోగులు..

బుధవారం ఉదయం 9 గంటల సమయంలో శ్రీవారి భక్తుడు తలనీలాలు సమర్పించడానికి హెచ్ వీసీ కల్యాణకట్ట వద్దకు వచ్చాడు. అనంతరం అతను గుండు శుభ్రం చేసుకునే సమయంలో సుమారు రూ.50 వేలు విలువ చేసే బంగారు ఉంగరం పోగొట్టుకున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కల్యాణకట్ట ఉద్యోగులు వంకీపురం పవన్, పురుషోత్తంకు ఉంగరం దొరికింది. అనంతరం వారు తిరుమల ఏవీఎస్వో శైలేంద్రకు ఉంగరాన్ని అందజేశారు. తరువాత భక్తుడి వివరాలు సేకరించి విజిలెన్సు అధికారులు ఉంగరం అందజేశారు. నిజాయితీ చాటుకున్న వంకీపురం పవన్, పురుషోత్తంను విజిలెన్సు అధికారులు అభినందించారు.

టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా ఎస్పీ..

టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా తిరుపతి జిల్లా ఎస్పీని హర్షవర్ధన్ రాజును నియమించిన రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు ఎస్పీతో పాటు సీవీఎస్ఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు టీటీడీ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

మలయప్ప స్వామి వారి విహారం..



తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు తెప్పపై విహరించారు.. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఐదుచుట్లు విహరించారు.

బయోడైవర్సిటీ బోర్డు పర్యటన


మాట్లాడుతున్న చైర్మన్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు బుధవారం పర్యటించింది. అనంతరం బోర్డు చైర్మన్ విజయకుమార్ బృందం వీసీ ఛాంబర్‌లో అధికారులతో సమావేశమైంది. పీఎం ఉషా ప్రాజెక్ట్ పరిశీలకులు, ఏపీఎస్‌సీహెచ్‌ఈ-ఐఐసీ ఇన్వెస్టిగేటర్స్ హాజరైన ఈ సమావేశంలో బయోడైవర్సిటీ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ తిరుపతి, తిరుమలలో బయోడైవర్సిటీ పార్క్ ఏర్పాటు చేసి, హాట్ స్పాట్‌లను డెవలప్ చేయాలని సూచించారు. సమావేశంలో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డీఎం మమత పాల్గొన్నారు

దర్జాగా కాలువ కబ్జా

- గతంలో కబ్జాను అడ్డుకుని బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు
- తాజాగా గోడ నిర్మాణం


కాలువ పోరంబోకు స్థలంలో అక్రమంగా ప్రహరీ నిర్మించిన కబ్జాదారులు

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ నేతల అండదండలతో క్షేత్రస్థాయిలో చోటామోటా నాయకుల ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వాగులు, వంకలు, కాలువలు ఇలా కనిపించిన ప్రతి భూమిని కబ్జా చేసుకుంటూ పోవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా పట్టణంలోని ఎస్వీ సినిమాస్ థియేటర్ సమీపంలోని బాలాజీ కాలనీ వద్ద సర్వే నంబరు 171లో కాలువ ఉంది. భారీ వర్షాలు కురిస్తే వికలాంగుల కాలనీ, బీడీ కాలనీ, అక్కగార్లకాలనీ, జోగుల కాలనీల నుంచి ఈ కాలువ మార్గంలో నీరు నూకలగుంటకు చేరుకుంటుంది. గతంలో ఈ కాలువతో పాటు పక్కనే ఉన్న కాలువ పోరంబోకును అక్రమించేందుకు కొంతమంది యత్నించారు. అయితే ఆక్రమణలను రెవెన్యూ అధికారులు అడ్డుకుని బోర్డును ఏర్పాటు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కబ్జారాయుళ్లు మరోసారి పడగవిప్పారు. రాత్రికి రాత్రే కాలువ పోరంబోకులో అక్రమంగా నిర్మాణాలను చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా ప్రహరీ గోడను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి గేటును అమర్చడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమి పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన బోర్డును సైతం కబ్జాదారులు తొలగించడంపై స్థానికులు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటే, ప్రస్తుత అధికారులు చోద్యం చూస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్ శివరామసుబ్బయ్యను వివరణ కోరగా.. ఇప్పటికే ప్రభుత్వ కాలువ పోరంబోకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కాలువ కబ్జాకు గురైనట్లు తేలితే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాయని హెచ్చరించారు.

డ్రోన్‌తో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

చంద్రగిరి: డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పోలీసు శాఖ దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డ్రోన్ నిఘాతో మంగళవారం రంగంపేట పరిసర ప్రాంతాలను జల్లెడపట్టారు. మత్తు పదార్థాలు సేవించేవారితో పాటు శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో రంగంపేటతో పాటు నిర్మానుష్య, మారుమూల ప్రాంతాలను సైతం జల్లెడపట్టారు. పోలీసులు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్ సహాయంతో ప్రతి రోజు తిరుపతి, రంగంపేట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

32 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 32 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమా నా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు సూపరింటెండెంట్ ఎన్‌వీ సుబ్బారెడ్డి మీడియాకు తెలిపారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లకు మంగళం

తిరుపతి సిటీ: తుడా మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ఎస్వీయూ గేట్-1, ప్రకాశం నగర్ క్వార్టర్స్ నుంచి వెళ్లే రహదారులను రద్దు చేసే యోచనలో ఉన్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బుధవా రం తెలిపారు. ఎమ్మెల్సీలు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సమాధా నం ఇస్తూ ఎస్వీయూలో 3 రోడ్లను విస్తరించే మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ఉన్నాయని, ఇందులో 2 రోడ్ల కారణంగా ఎస్వీయూ పరిధి తగ్గి విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

లేని భూమిని విక్రయించి..


మాట్లాడుతున్న బాధితుడు చిన్న సుబ్బయ్య

తిరుపతి కల్చరల్: లేని భూమిని తమకు విక్రయించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని నిరుపేదలైన తమకు న్యాయం చేయాలని బాధితులు చిన్న సుబ్బయ్య, మహబూబ్‌బాషా జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ లెక్కదాఖలాలోని సర్వేనంబర్ 245/3బి తాము ఇరవై ఏడన్నర అంకణాలు, ముప్పై ఏడున్న అంకణాల భూమిని కాలూరు క్రాస్‌లో కాపురం ఉంటున్న విమలమ్మ వద్ద 2021లో భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపారు. అయితే తమకు ఇచ్చిన 2 ప్లాట్లు నేషనల్ హైవే రోడ్డుకు పోయాయన్నారు. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచి ఆ ప్లాట్లను తమకు విక్రయించి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. మోసం చేసిన వారిని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే నాని అనుచరులమంటూ మీరు ఏమి చేసుకోలేరంటూ నుంచి ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ


బాధితురాలిని విచారిస్తున్న సీఐ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలానికి చెంది న వృద్ధురాలి మెడ లో గోల్డ్ చైన్ చోరీ అయింది. వివరాలు.. ఓటేరు పంచాయతీ అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న బోడిరెడ్డి పందు రెడ్డి భార్య అనంతమ్మ పండ్లు అమ్ముకుని జీవనం సాగిస్తోంది. బుధవారం ఓటేరు ప్రభుత్వ పాఠశాల వద్ద పుచ్చకాయలు అమ్ముకుని ఇంటికి వెళ్తుండగా సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు గల వ్యక్తి నడుచుకుంటూ వచ్చి వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ లాక్కుని అప్పటికే మరో వ్యక్తి బైక్‌పై సిద్ధంగా ఉండగా ఉడాయించారు. సదరు వ్యక్తి తెల్ల చొక్కా, నల్లరంగు ప్యాంట్ ధరించి ముఖానికి మాస్క్ పెట్టుకున్నాడన్నారు.